ఆస్పత్రిలో ఉన్న వైద్యులు ఏమయ్యారు : రేగా

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 20: మణుగూరు వంద పడకల ఆస్పత్రిలో ఉన్న 13 మంది డాక్టర్స్ ఏమయ్యారని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం ఒక ప్రకటనలో అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం మారగానే ఇంత తేడా ఎందుకు, జీతాలు ఇవ్వని స్థితిలో ఉందా అని ప్రశ్నించారు. మణుగూరు వంద పడకల ఆస్పత్రిలో ఆక్సిజన్ ఇచ్చే ప్లాంట్ ఎందుకు నడవట్లేదని, బ్లడ్ బ్యాంక్‌ను పట్టించుకునే నాథేడే లేడా అని పేర్కొన్నారు. ఆస్పత్రిలోకి మీడియా కవరేజ్‌కు వెళ్తే డాక్టర్లు ఎందుకు ఆంక్షలు పెడుతున్నారని ప్రశ్నించారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ ఈఈ

బిల్డింగ్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ అధికారులు

చండ్రుగొండ, ఫిబ్రవరి 20: చండ్రుగొండ లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల భవనాన్ని ఐటీడీఏ ఈఈ చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. ఇటీవల ఐటీడీఏ పీవో రాహుల్ ఆశ్రమ పాఠశాలను సదర్శించిన సమయంలో హాస్టల్ బిల్డింగ్ పెచ్చులు ఊడుతున్న విషయాన్ని పరిశీలించి, కొత్త బిల్డింగ్ ఎలా పెచ్చులు ఊడుతున్నాయనే విషయంపై ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై డీఈ చంద్రశేఖర్ క్షేత్రస్థాయి పర్యటన చేసి బిల్డింగ్‌కు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఆయన వెంట డీఈ బాపనయ్య, ఏఈ సుబ్బరాజు ఉన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల నిరసన

నిరసన తెలుపుతున్న సీపీఎస్ ఉద్యోగులు

దమ్మపేట, ఫిబ్రవరి 20: యూనిఫైడ్ పెన్షన్ స్కీం విధానాన్ని వ్యతిరేకిస్తూ దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగులు(సీపీఎస్) గురువారం నిరసన వ్యక్తం చేశారు. తొలుత దమ్మపేట జడ్పీహెచ్ఎస్‌లో సమావేశమై యూపీఎస్‌పై యుద్ధ బేరి పోస్టర్లను ఆవిష్కరించారు. మార్చి 2న టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించతలపెట్టిన యుద్ధభేరి ధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాజశేఖర్, సీపీఎస్ ఈయూ బాధ్యులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించండి

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 20: జిల్లాలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల గోపాలాచార్యులు కోరారు. గురువారం హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.వీరాస్వామి, భద్రాచలం పరిశీలకులు వెంకటేశ్వరరావును సంఘం బాధ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అర్చకులకు సంబంధించి ఐడీ కార్డుల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆలయాల్లో అర్చకులకు అందాల్సిన వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నావజ్జల ప్రసాద్‌శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మరిగంటి భార్గవాచార్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పురాణం సుమన్‌కుమార్‌శర్మ, జిల్లా కోశాధికారి కౌతా ప్రసాద్‌శాస్త్రి, జిల్లా సహాయ కార్యదర్శి పొడకంటి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 20: మణుగూరులో డాక్టర్ శరత్ అద్దంకి పర్యవేక్షణలో గురువారం శ్రీవిద్య అభ్యాస ఎడ్యుకషనల్‌కు నిత్యావసర వస్తువులు, పిల్లలకు స్నాక్స్ అందించారు. ఆరు నెలలుగా సుమారు రూ.7.70 లక్షలు ఖరీదు చేసి పిల్లలకు సంబంధించిన అన్ని వసతులు అందజేశారు. ప్రస్తుత సభ్యులు ఉల్లెందుల సురేష్, తూముల శ్రీనివాస్, దుర్గ్యాల సుధాకర్, జంపాల శ్రీనివాస్, నాజర్‌పాషా చేతుల మీదుగా వీటిని అందించారు.

సైబర్ నేరాలు, కొత్త చట్టాలపై అవగాహన

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కరకగూడెం, ఫిబ్రవరి 20: ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని వీరాపురం క్రాస్‌రోడ్డు వద్ద స్థానికులు, ప్రయాణికులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డ్రగ్స్, కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ 1930కి కాల్ చేయాలని, వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు. అంతకుముందు ఎస్ఐ రాజేందర్ మండలంలోని సీతారాంపురం గ్రామంలో వాహన తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిచారో.. అంతే సంగతి..!

రోడ్డు పక్కన రైల్వే సైడింగ్ పనులు

రామవరం, ఫిబ్రవరి 20: ఈ ఫొటో చూశారు కదా..! అక్కడొక రోడ్డు, దాని పక్కనే పెద్ద కందకం లాంటి తవ్వకాలు. ఆ రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఏమాత్రం ఆదమరుపుగా ఉన్నా.. అంతే సంగతులు. ఆ కందకంలో పడిపోయినట్లే. సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ధన్బాద్ పాత బస్టాండ్-సివిల్ కార్యాలయం మార్గంలో వీకే ఓసీ విస్తరణలో భాగంగా రోడ్డు పక్కనే రైల్వే సైడింగ్ పనులు జరుగుతున్నాయి. మాయాబజార్ వద్ద రోడ్డు పక్కన సుమారు పది మీటర్ల లోతున మట్టి తవ్వుతున్నారు. తవ్వకాలకు అడ్డుగా ఉండడంతో విద్యుత్ లైన్లను పూర్తిగా తొలగించారు. దీంతో రాత్రి వేళ ఇక్కడ చిమ్మచీకటిగా ఉంటున్నది. పీవీకే 5 ఇంక్లైన్, ఆర్సీహెచ్‌పీ, సివిల్, ఎస్అండ్‌పీసీ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు, ఇతరులు ఈ రోడ్డు మీదుగానే రేయింబవళ్లు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. వారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా సరే.. వాహనం అదుపు తప్పి కందకంలాగా ఉన్న ఆ ప్రదేశంలో పడిపోయే ప్రమాదముంది. అదే జరిగితే.. ప్రాణాపాయం తప్పక ఉంటుంది. ఈ రోడ్డు పక్కన ప్రమాద హెచ్చరిక బోర్డులుగానీ, రెయిలింగ్‌గానీ, రేడియం స్టిక్కర్లుగానీ ఏవీ లేవు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌గానీ, సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని, భద్రతను నిత్యం వల్లెవేసే అధికారులుగానీ దీనిని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఏరియా సివిల్ ఏజీఎం రామకృష్ణను 'నమస్తే' వివరణ కోరింది. ''ఈ సమస్య మా దృష్టికి కూడా వచ్చింది. ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. సూచిక బోర్డును, సైడ్ రెయిలింగ్‌ను, లైట్లను ఏర్పాటు చేస్తాం'' అన్నారు.

పాఠశాలల్లో 'బాలమేళా'లు ప్రారంభం

కరకగూడెం : ఏంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కరకగూడెం, ఫిబ్రవరి 20: విద్యార్థుల సామర్థ్యాలను బయటకు తీసేందుకు బాలమేళా నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మంజూల అన్నారు. గురువారం మండలంలోని అనంతారం జడ్పీ పాఠశాలలో బాలమేళా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థుల సామర్థ్యాలను టీఎల్ఎమ్ ద్వారా వివిధ రూపాల్లో ప్రదర్శన చేశారు. విద్యార్థుల నైపుణ్యానికి, ఉపాధ్యాయుల పనితీరుకు ఆయా పాఠశాలలకు గ్రేడ్లను ఇస్తూ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు ఏంఈవో మంజులను సన్మానించారు. జయబాబు, వెంకటేశ్వర్లు, బావ్‌సింగ్, వసంతరావు, కుమారస్వామి, మోహన్‌రావు, రామస్వామి, సూర్యనారాయణ, ప్రసాద్, నారాయణ, వినోద్, వసంత, ఉమ, మౌనిక పాల్గొన్నారు.

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 20: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మణుగూరులో కాంప్లెక్స్ స్థాయిలో ఎఫ్ఎల్ఎన్ మేళా 2025 నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ హెచ్ఎం స్వర్ణజ్యోతి పాల్గొని మేళాను ప్రారంభించి మాట్లాడారు. కాంప్లెక్స్ సెక్రటరీ ఈసం బ్రహ్మయ్య, హెచ్ఎంలు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన పిల్లలకు బహుమతులు అందించారు.

చండ్రుగొండ, ఫిబ్రవరి 20: మండల పరిధిలోని అయ్యన్నపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కాంప్లెక్స్ స్థాయి బాలమేళాను గురువారం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ టీఎల్ఎం మేళాను పరిశీలించారు. కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పిల్లలు, విద్యార్థులు తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనా పద్ధతిలో ఉపాధ్యాయులు మార్పులు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వనం నుంచి జనంలోకి రామక్క దేవత

ఆళ్లపల్లి : వనదేవతను తీసుకొస్తున్న పూజరులు, కొమరం వంశీయులు

పినపాక : జాతరలో వనదేవతను తీసుకువస్తున్న దృశ్యం

ఆళ్ళపల్లి, ఫిబ్రవరి 20: కొమరం వంశీయుల ఆరాధ్య దైవమైన రెక్కల రామక్క జాతర గురువారం సాయంత్రం వనం నుంచి వన దేవతలను జనంలోకి పూజరులు, కొమరం వంశీయులు ఆలయ ప్రాంగణంలోనున్న గద్దెలకు తీసుకురావడంతో ఆ ప్రాంతమంతా జనసంద్రమైంది. దేవతను తీసుకు వస్తున్న సమయంలో కొమరం వంశీయులు, కమిటీ సభ్యులు, గిరిజన సంప్రదాయాలు, నృత్యాలతో పాండవుల గుట్ట నుంచి గుడి ప్రాంగణానికి దేవతను తీసుకువచ్చారు. ఈ జాతరకు భద్రాచలం, పినపాక, ఇల్లెందు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య విచ్చేసి వన దేవతలను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గిరిజన నృత్యాలు చేశారు. జాతరను పురస్కరించుకొని నిర్వహించిన వాలీబాల్ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మండల కేంద్రంలో అతి పెద్ద జాతర కావడంతో ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను, ఆళ్ళపల్లి ఎస్సై రతీష్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సడాలమ్మ తల్లి జాతరకు పోటెత్తిన భక్తజనం

పినపాక, ఫిబ్రవరి 20: పినపాకలో సడాలమ్మ తల్లి జాతర వైభవంగా జరుగుతుంది. గురువారం సమీప గుట్టల నుంచి వనదేవతను గిరిజన పూజారులు గుడి వద్దకు తీసుకువచ్చారు. వనదేవత రాకతో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తజనం పులకించిపోయారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. గిరిజన సాంప్రదాయ బద్దంగా డప్పు, డోలు వాయిద్యాల నడుమ పడిగల విన్యాసాలతో జాతర ప్రాంగణం మార్మోగింది. అంతకుముందు వనదేవత, సడాలమ్మ తల్లి ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం రోజున అమ్మవారికి మొక్కుబడులు ఇచ్చే కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నీలకంఠేశ్వర స్వామి కల్యాణానికి హాజరుకావాలి

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 20: మణుగూరు నీలకంఠేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలకు హాజరుకావాలని ఆలయ కమిటీ చైర్మన్ కూచిపూడి బాబు ఆధ్వర్యంలో మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డికి, సీఐ సతీష్‌కుమార్‌కు ఆహ్వాన పత్రికలను అందించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్లలో వారిని కలిసి శాలువ కప్పి సత్కరించి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

శివరాత్రి కల్యాణం పోస్టర్ ఆవిష్కరణ

ములకలపల్లి, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే శివరాత్రి కల్యాణ పోస్టర్‌ను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే స్వగృహం గండుగులపల్లిలోని ఆయన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.

స్థానిక రిజర్వేషన్ అమలు కోసం వినతి

టేకులపల్లి, ఫిబ్రవరి 20: ఎస్సీ కులాల స్థానిక రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేయాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ కోరారు. గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను కోయగూడెంలోని తన నివాసంలో కలిసి బొమ్మెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కండె రాములు, ఎనుగంటి అర్జున్‌రావు, నర్సయ్య, స్వామి, కొమరయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, రాము పాల్గొన్నారు.

గొల్ల కొత్తూరులో వైద్య శిబిరం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 20: సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పరిధిలోని గొల్లకొత్తూరు గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి ఏరియా హాస్పిటల్ డాక్టర్ శేసగిరిరావు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం తమవంతు సామాజిక బాధ్యతగా ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తుందన్నారు. స్టాఫ్ నర్సు భవాని, సిబ్బంది నందిని, అంకురాజు, లింగయ్య, రమేష్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

టేకులపల్లి, ఫిబ్రవరి 20: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి టేకులపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సులానగర్ గ్రామానికి చెందిన అజ్మీర శివ, బుజ్జి కుమారుడు అజ్మీర అశోక్ (34) గత రాత్రి ద్విచక్ర వాహనంపై టేకులపల్లి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో టేకులపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే మార్గంలో సేవాలాల్ గుడి సమీపాన కేఓసీ లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద బొగ్గులోడ్‌తో కొత్తగూడెం వైపు వెళ్తున్న లారీ రాత్రి నిర్లక్ష్యంగా నడుపుకుంటూ సడన్ బ్రేక్ వేయగా వెనుక వస్తున్న అశోక్ లారీకి తగిలి కిందపడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

భద్రాచలం, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా విద్యారంగాన్ని గాలికొదిలేశారని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ అన్నారు. గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. పృథ్వీ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని, తెలంగాణకు విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి విద్యారంగాన్ని కాపాడాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరుతోనే హక్కుల సాధన

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 20: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధనకు, వేతనాల పెంపునకు, సమస్యల పరిస్కారానికి పోరాటం ఒక్కటే మార్గమని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, నాయకుడు క్రిష్టఫర్ అన్నారు. కార్పొరేట్‌లోని ఇల్లెందు బంగ్లోస్ వద్ద కాంట్రాక్ట్ కార్మికులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కృష్ణయ్య, క్రిష్టఫర్ మాట్లాడుతూ... సింగరేణి కార్మికుల సమస్యలు అనేకం ఇప్పటివరకూ ఐక్య ఉద్యమాలతోనే పరిష్కారమైనట్లు చెప్పారు. జీవో నంబర్ 22 ప్రకారం వేతనాల పెంపునకు, ఈఎస్ఐ కార్డుల సాధనకు, ఇతరత్రా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలన్నారు. నాయకులు రంజిత్ రాజు, చుక్కయ్య, కృష్ణమూర్తి, సుజాత, మణెమ్మ, సుశీల, వెంకటేశ్వర్లు, రాము, సాగర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పెద్దోళ్లకు అన్నం.. పేదోళ్లకు సున్నం

మాట్లాడుతున్న డాక్టర్ పాపారావు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 20: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ అనే కంచంలో అంబానీ, అదానీ వంటి పెద్దోళ్లకు అన్నం వడ్డించిందని, సామాన్య ప్రజల వంటి చిన్నోళ్లకు మాత్రం సున్నం మిగిల్చిందని ఆర్థిక విశ్లేషకుడు డాక్టర్ పాపారావు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో గురువారం సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటైంది. ముఖ్య అతిథి పాపారావు మాట్లాడుతూ... సమాజ సంపదలో సృష్టికర్తలుగా ఉన్న కార్మికులను, వ్యవసాయ కూలీలను, రైతులను బడ్జెట్ విస్మరించిందని, వారికి ఊరటనిచ్చే అంశాలేవీ లేవని అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో నాయకులు ఏజే రమేష్, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, యలమంచిలి వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్థాయి శిక్షణ

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 20: ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని ఏపీఎం దుర్గారావు అన్నారు. గురువారం మండల పరిధిలోని మర్రిగూడెం పంచాయతీలో నందిని గ్రామ సంఘం సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పుష్ప, రామ్మూరి, కృష్ణకుమారి, స్రవంతి, రమేష్, నరేష్, గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 20: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణ, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

అన్నదానానికి వితరణ

భద్రాచలం, ఫిబ్రవరి 20: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి కీసర మేడ్చల్ మల్కాజ్‌గిరి మండలం దమ్మైగూడకు చెందిన పీవీ కృష్ణమూర్తి, జ్ఞానద దంపతులు రూ.1,00,116 వితరణగా అందజేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వనంవారి కృష్ణాపురం గ్రామానికి చెందిన తుపాకుల ఎలగొండస్వామి, రమాదేవి దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజావీధి మార్గం గుండా రాకపోకలు జరగాలి

భద్రాచలం, ఫిబ్రవరి 20: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయం సమీపంలోని రాజావీధి మార్గాన్ని మూసివేయడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజావీధి మూసివేయడం వల్ల ఆలయానికి వచ్చే అర్చకులు, వేదపండితులు, భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాహన గతంలో ఎన్నడూ లేని విధంగా రాజావీధిని అధికారులు మూసివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు వాపోయారు. రాజావీధి రహదారిని తిరిగి రాకపోకలు సాగేలా చూడాలని, లేదంటే అక్కడ సెక్యూరిటీని ఏర్పాటు చేసి రహదారి ఎప్పటికప్పుడు తెరిచి ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అపార్ నమోదు పూర్తి చేయాలి

సమావేశంలో సూచనలిస్తున్న ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సతీష్

అశ్వారావుపేట, ఫిబ్రవరి 20: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలను అపార్ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సతీష్ స్పష్టం చేశారు. అపార్ నమోదులో మండలం వెనుబడి ఉన్నదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం అశ్వారావుపేట ఎంఈవో కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాలు, కళాశాలల బాధ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అపార్ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ కార్డు జారీ చేసేలా పని చేయాలని, ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎంవో నాగ శేఖర్ రావు, పీఎంలో సైదులు, ఎంఈవో ప్రసాదరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 20: స్థానిక వ్యవసాయ కళాశాలలో ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం స్థాయిలో జరుగుతున్న బోధన సిబ్బంది క్రీడలు, సాహితి, సంస్కృతి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజు గురువారం వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టేబుల్ టెన్నీస్, చెస్ పోటీలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 9 వ్యవసాయ కళాశాలల నుంచి వచ్చిన బోధనా సిబ్బంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను కళాశాల అసోషియేట్ డీన్ డా.జె.హేమంత్ కుమార్, శాస్త్రవేత్తలు శ్రావణ్ కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలి

ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాల్వంచ, ఫిబ్రవరి 20: విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణం, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో శ్రీరామ్మూర్తి, పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం రమ పేర్కొన్నారు. గురువారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో బృందం యూత్, ఎకో క్లబ్ ఏర్పాటు చేశారు. పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. పర్యావరణం, పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు.

మున్సిపల్ పరిధిలో జియోగ్రాఫికల్ సర్వే

పాల్వంచ, ఫిబ్రవరి 20: మున్సిపాలిటీ వ్యాప్తంగా మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అమృత్ 2.0 ద్వారా జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టంతో గురువారం సర్వే నిర్వహించారు. మున్సిపల్ పరిధి ఇందిరా కాలనీలో చేపట్టిన సర్వే సరళిని కమిషనర్ సుజాత పరిశీలించారు. 24 వార్డుల్లో సమగ్ర సర్వే కొనసాగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. సర్వే ఆఫ్ ఇండియా అధికారుల నేతృత్వంలో ఈ సర్వే కొనసాగుతోంది.

వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు రక్షణపై అవగాహన

మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 20: సింగరేణి సంస్థ అంతర్గత భద్రత విభాగం ఏకకాలంలో మూడు రీజియన్లలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం కొత్తగూడెం కార్పోరేట్ ఇల్లెందు క్లబ్‌లో భద్రత చర్యలపై అగాహన కల్పించారు. అంతర్గత భద్రతా విభాగం డీజీఎంఎస్ సౌత్ సెంట్రల్ జోన్ హైదరాబాద్ సహకారంతో కొత్తగూడెం రీజియన్‌లోని కార్పోరేట్, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాల్లోని ఏరియా ఇంజినీర్లు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్లకు, అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల సేఫ్టీ ఆఫీసర్లకు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులతో కొత్తగూడెం ఇల్లెందు క్లబ్‌లో జీఎం శ్రీనివాస్ అధ్యక్షతన ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 20: హైదరాబాద్‌